క్లుప్తంగా

పేదింటి మహిళల వివాహానికి సాయం

యాచారం: పేద మహిళల వివాహానికి మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతి సహకారం అందిస్తున్నారు. గ్రామానికి చెందిన రమావత్ సోనా, చందు దంపతుల కూతురు అనిత వివాహానికి ఆమె శుక్రవారం ఒక పట్టుచీర, క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, యాద య్య, పటాన్ అఖిల్ ఖాన్, రాములు, భాషా, తారాసింగ్, కిషన్, వెంకయ్య, కుమార్, రాధిక, హమాలి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వంద బస్తాల సిమెంట్

జెడ్పీటీసీ ధశరథ్‌నాయక్

కడ్తాల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అపర్ణ పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి తోడ్పాటునందిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు జర్పుల ధశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఆలయాన్ని స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. పనులను పరిశీలించారు. ఆలయ నిర్వాహకుల కోరిక మేరకు జెడ్పీటీసీ సభ్యుడు ఆలయ నిర్మాణానికి 100 బస్తాల సిమెంట్ రాధాకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ప్రియారమేష్, వార్డు సభ్యులు మహేశ్, నాయకులు సత్యనారాయణ, వెంకటయ్య, గిరి, రమేశ్, సత్యం, శ్రీను, కృష్ణ, భూమయ్య తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

ఆమనగల్లు: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు కోరారు. శుక్రవారం ఆయన మాడ్గుల మండలం అవురుపల్లి, నల్లవారిపల్లి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో చేపడుతున్న ఈజీఎస్ పనులను తనిఖీ చేశారు. కూలీలకు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం నల్లవారిపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నల్లవారిపల్లి సర్పంచ్ పార్వతమ్మ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఈత సరదాతో ప్రాణాలు కోల్పోవద్దు

పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫ్లెక్సీల ఏర్పాటు



ఫ్లెక్సీ ఏర్పాటు చేయిస్తున్న ఎస్‌ఐ వెంకట్రాంరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రమాదాల నివారణకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెరువులు మరియు కుంటల వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం సీఐ మన్మోహన్ తెలిపారు. తాజాగా ఇద్దరు యువకులు స్నేహితులతో కలిసి సంఘీనగర్ శివారులోని ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయిన విషయం విదితమే. దీంతో చెరువులు, కుంటల వద్ద హెచ్చరికల ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు.

నిర్దేశిత పనులు పూర్తి చేయండి

ఎంపీఓ రఘు

తలకొండపల్లి: శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని దేవుని పడకల్‌లో ఎంపీఓ రఘు పర్యటించారు. సర్పంచ్ శ్రీశైలంతో కలిసి నర్సరీని పరిశీలించారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా మొక్కలకు నీటిని అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నర్సరీలో మొక్కల పెరుగుదలను చూసి సర్పంచ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జంగయ్య, వనసేవక్ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, జిల్లా గిరిజన నాయకుడు రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైసిగండి శివాలయ పరిసరాలలో 'నేలతల్లి' ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాందాస్ నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కల్యాణ్, సురేశ్, రాజ్‌కుమార్, ముఖేశ్, జయేందర్, రామ్‌తేజ్ తదితరులున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

యాచారం: సీఎం కేసీఆర్ చిత్రపటానికి యాచారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తు పే స్కేల్ ప్రకటించినందుకు గాను తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు జంగయ్య, వెంకటయ్య, శ్రీనువాస్, దార స్వామి, రాజ్‌కుమార్, నాగరాజు, శ్రీను, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్ల తండ్లాటకు పరిష్కారం

- ప్రభుత్వాధికారులకు తప్పిన నీటితిప్పలు
- ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్‌ల సమన్వయంతో బోర్‌మోటార్ ఏర్పాటు
- త్వరలో మిషన్ భగీరథ పైప్‌లైన్



ప్రభుత్వ కార్యాలయాలకు నీటి సరఫరాకు ఆధునీకరించిన బోరు

యాచారం: ప్రభుత్వ కార్యాలయాల్లోని నీటి తండ్లాటకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ప్రజలకు కష్టమొస్తే పరిష్కరించే అధికారులే తమ సమస్య పరిష్కారంలో శ్రద్ధ చూపలేదు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు సైతం నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. కొంత మంది అధికారుణులు విధుల మధ్యలోనే ఇంటికెళ్లిపోయేవారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రం సమీపంలో ప్రభుత్వ భవన సముదాయాలున్నాయి. ఒకే చోట మండల పరిషత్, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, ఈజీఎస్, ఇరిగేషన్, సెర్ప్, మహిళా సమాఖ్య, దివ్యాంగుల భవనం, కొత్తగా నిర్మించిన జెడ్పీ అతిథి గృహం ఉంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపు 200మందికి పైగానే అధికారులు, కింది స్థాయి సిబ్బంది ఉన్నారు. ఇన్ని శాఖల కార్యాలయాలు ఒకే చోట ఉన్న ఏ శాఖ కార్యాలయానికి నీటి సౌకర్యం లేదు. కొన్ని శాఖల అధికారులు ట్యాంకర్ల నుంచి నీటిని తెప్పించుకుంటే మరి కొన్ని శాఖల అధికారులు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని చేతిపంపు నుంచి తీసుకువచ్చి కార్యాలయాల్లో పోసేవారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో తాగునీటికి నెలకు రూ.2వేలకు పైగా చెల్లించి మినరల్ వాటర్ తెప్పించుకునేవారు.

రూ.2లక్షలతో పైప్‌లైన్

యాచారం మండల పరిషత్ ప్రభుత్వ శాఖల భవన సముదాయాలను 20 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో ప్రభుత్వ కార్యాలయాల్లో నీటి సమస్య తీర్చేందుకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బోరింగ్ ఏర్పాటు చేశారు. తాజాగా ఎంపీపీ కొప్పు సుకన్య, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సుచరిత‌ల సమన్వయంతో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న చేతిపంపును తొలగించి కొత్తగా బోరు మోటార్‌ను బిగించారు. నీరు పుష్కలంగా వస్తుండడంతో సుమారు రూ.2లక్షల నిధులతో అన్ని శాఖల కార్యాలయాలకు ప్రత్యేక పైపులైన్ వేశారు. తాగునీటి కోసం త్వరలో మిషన్ భగీరథ ఉన్నతాధికారులతో మాట్లాడి అన్ని శాఖల కార్యాలయాలకు నీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ విజయలక్ష్మితెలిపారు.

టాయిలెట్స్ లేక ఇబ్బందులు

తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయ, ఇరిగేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. టాయిలెట్స్ సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ప్రజలకు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో చెట్లు, రాళ్లు, రప్పలు, వ్యవసాయ పొలాల వెంట పరుగులు తీస్తున్నారు. కొన్నిసార్లు మహిళలైతే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జెడ్పీఅతిథి గృహం నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచకోక అలంకార ప్రాయంగా మారింది.

ఇబ్బంది పడుతున్నాం



తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు పనుల నిమిత్తం వస్తాం. టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నాం. తప్పని పరిస్థితుల్లో చెట్ల మాటుకే వెళ్తున్నాం. ఉచిత మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలి.

– కొర్ర అరవింద్‌నాయక్, మంతన్‌గౌరెల్లి

అన్ని కార్యాలయాలకు 'భగీరథ'



ఇన్నాళ్లు నీటి సమస్యలతో ఇబ్బందులు పడ్డాం. సమష్టి నిర్ణయం తీసుకుని సమస్య పరిష్కరించుకున్నాం. త్వరలో మిషన్ భగీరథ ఉన్నతాధికారులతో మాట్లాడి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు తాగునీటిని సరఫరా చేసేలా కృషి చేస్తాం.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ

సమస్యలు పరిష్కరిస్తాం



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో టాయిలెట్స్ నిర్మిస్తాం. త్వరలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై నిర్ణయం తీసుకుంటాం. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అతిథి గృహాన్ని త్వరలో ప్రారంభిస్తాం. – కొప్పు సుకన్య, ఎంపీపీ

ఎమ్మెల్యే మంచిరెడ్డికి మాతృవియోగం

సంతాపం తెలిపిన సీఎం కేసీఆర్

- అంత్యక్రియలకు హాజరైన మంత్రి సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి మంచిరెడ్డి పద్మమ్మ(92) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున తుదిశ్వాస విడిచింది. మండల పరిధిలోని ఎల్మినేడులో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన కుమారుడు ప్రశాంత్ రెడ్డి, కుటుంబ సభ్యులు కంటతడిపెట్టారు. పద్మమ్మ మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, కాలె యాదయ్య, అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, యెగ్గె మల్లేశం, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మేడ్చల్ జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, అడిషనల్ డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి, రాచకొండ సీపీ చౌహన్, డీసీపీలు సీహెచ్ శ్రీనివాస్, సాయిశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు కొదండరెడ్డి, సుధీర్‌రెడ్డి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యాని మనోహర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ వెంకటరమణారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి ,క్యామ మల్లేశ్, స్థానిక ప్రజాప్రతినిధులు అంత్యక్రియలకు హాజరయ్యారు.



తల్లి పాడె మోస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



పద్మమ్మ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి

నాణ్యత పాటిస్తే మద్దతు ధర

ఏఓ శ్రీలత

కడ్తాల్: నాణ్యతా ప్రమాణాలు పాటించిన ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని మండల వ్యవసాయాధికారి శ్రీలత అన్నారు. శుక్రవారం ఆమె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యలో తేమ 17 శాతం ఉండాలన్నారు. అగ్రి రైతు సేవా కేంద్రంలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 40 కేజీల బస్తా ధర రూ.3,500 ఉండగా రైతులకు రాయితీపై రూ.1,225కే అందజేస్తున్నామని చెప్పారు. ఆమె వెంట వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి, రైతులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీలత

ఉచిత విద్యను అందించేందుకు 'మదర్సా'



మదర్సాను ప్రారంభిస్తున్న అబ్దుల్ ఖాదర్‌ఖాద్రి

మహ్మదీయ మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఖాద్రి

ఆమనగల్లు: పట్టణంలోని మహ్మదీయ మసీదులో మదర్సాను శుక్రవారం మహ్మదీయ మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఖాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉచితంగా విద్యను అదించేందుకు మదర్సాను ప్రారంభించామన్నారు. విద్యార్థులకు చిన్న నాటి నుంచి సత్ప్రవర్తనతో అల్లా మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం మదర్సా కమిటీ సభ్యులకు కలిసి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ గౌరవ అధ్యక్షుడు చాంద్‌పాషా, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, కార్యదర్శి మహబూబ్ అలీ, సంయుక్త కార్యదర్శి రహీం, లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా, సభ్యులు షేక్ అహ్మద్, బాబా, బడేమియా, ఇంతియాజ్, జహంగీర్, ఖలీల్, బాబా, ఖరీం, షేక్ హమీద్, జహంగీర్, ఫారూక్, డా.ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబరుడు.. పుచ్చలపల్లి సుందరయ్య

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

ఇబ్రహీంపట్నం: దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ముఖ్యుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ అన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భగా పట్టణంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జంగారెడ్డి, సామేల్, జగదీశ్, కవిత, సీహెచ్.జంగయ్య, ఎల్లేష్, ఎ.వెంకటేశ్, పురుషోత్తం, జగన్, శంకర్, స్వప్న, ముసలయ్య, వీరేశ్, రామకృష్ణారెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ఆశయాలను కొనసాగిస్తాం

ఆమనగల్లు: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం ఏరియా కార్యదర్శి కానుగుల వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శివశంకర్, కురుమయ్య, పోచయ్య, అరుణ్, కిరణ్, అమ్మన్న, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: నివాళి అర్పిస్తున్న సీపీఎం నేతలు

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

తలకొండపల్లి: పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటయ్య, శివశంకర్, బాలకిష్టయ్య, మండల కార్యదర్శి కురుమయ్య, కార్మికులు కృష్ణారెడ్డి, నరసింహ, అరుణ్, కుమార్, కల్పన, రాణి, విజయ, భాగ్యలక్ష్మి, మంజుల, స్వప్న, అరుణ, మానస, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కేసీఆర్‌ను గద్దె దింపే వరకు పోరాటం



రేవంత్‌రెడ్డి, నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న జయమ్మ, నాయకులు

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ

మంచాల: సీఎం కేసీఆర్‌ను గద్దె దింపే వరకు పోరాటాలు చేస్తామని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గుండమోని జయమ్మ అన్నారు. శుక్రవారం ఆమె పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని పార్టీ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పార్టీని నియోజకవర్గంలో బలమైన శక్తిగా తయారు చేస్తామన్నారు. గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మదుసూధన్‌రెడ్డి,పార్టీ మండల అధ్యక్షుడు వి.రాంరెడ్డి, ఎల్లమ్మ తండా సర్పంచ్ పద్మ నాయక్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎంఎస్‌బీవై'ను వినియోగించుకోవాలి

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో శుక్రవారం పీఎం సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) గ్రామస్తులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కందుకూకు మండలం మీర్‌ఖాన్‌పేట ఎస్‌బీఐకు చెందిన బ్యాంకు అధికారులు రవీందర్, సునీల్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. రూ.2లక్షల ప్రమాద బీమా కవరేజీ రూ.20 వార్షిక ప్రీమియం చెల్లించాలన్నారు. 18–70 ఏళ్ల లోపు మధ్య వయస్సున్న బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రమాదం లేదా, శాశ్వత వైకల్యాన్ని ఈ బీమా కవర్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ ప్రతినిధులు కరుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హయత్‌నగర్: ప్రమాదంలో మృతి చెందిన ఓ సీపీఐ కార్యకర్త కుటుంబానికి కార్యకర్తలు, నాయకులు అంగా నిలిచారు. పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని పాపాయ్యగూడలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. సీపీఐ కార్యకర్త గుంటగాని కొండల్‌రావు అదే గుడిసెలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. కాగా ఆయన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి, మండల కార్యదర్శి యాదిరెడ్డి, కౌన్సిలర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకుల నుంచి ఆర్థికసాయం కోరారు. రూ.2.30లక్షలు జమ చేసి కొండల్‌రావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శేఖర్‌రెడ్డి, వేణుగోపాలచారి, యాదగిరి పాల్గొన్నారు.

రెండో విడత పంపిణీ త్వరగా పూర్తిచేయండి



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యేను కోరిన గొర్రెల కాపరుల సంఘం నాయకులు

కడ్తాల్: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో శుక్రవారం గొర్రెల కాపర్ల సంఘం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరుల సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండో విడుత గొర్రెల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కోరారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు యాదయ్య, సర్పంచ్ కృష్ణయ్య, ఉప సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, నాయకులు వెంకటేశ్, బీరప్ప, చెన్నయ్య, మల్లయ్య, శ్రీను, జంగయ్య, శ్రీశైలం ఉన్నారు.

రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలి

మండల వ్యవసాయాధికారిణి అరుణకుమారి

ఆమనగల్లు: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు నిర్వాహకులు విధిగా రసీదు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణంలోని వాసవి ఫర్టిలైజర్స్, శ్రీ సాయి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, ఆగ్రో రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ధరల పట్టిక, స్టాకు నిల్వ తదితర రికార్డులను, పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి అరుణకుమారి మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలు అమ్మినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రాయితీపై జనుము విత్తనాలను రైతులకు అందిస్తున్నామని వివరించారు. 40 కేజీల జనుము విత్తనాల బస్తా ధర రూ.3500 కాగా సబ్సిడీపై రూ.1,225 అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చంద్రశేఖర్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న అరుణకుమారి

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచండి

ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్

ఆమనగల్లు: గ్రామాలలో చేపడుతున్న ఈజీఎస్ పనులలో కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించి ఈజీఎస్ పనులు చురుగ్గా సాగేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈజీఎస్ నిధులతో మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, పారిశుద్ధ్య కార్యక్రమాలలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీఓ శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ మాధవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మీర్‌ఖాన్‌పేట ఎస్‌బీఐ అధికారులు

అంతర్జాతీయ పోటీల్లో సత్తాచాటిన 'వీఎన్'



ధ్రువీకరణ పత్రాలతో వీఎన్ కరాటే అకాడమీ విద్యార్థులు

తుర్కయంజాల్: ఇంటర్నేషనల్ ఒకినావా గోజురాయ్ కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12,13,14 తేదీల్లో మలేషియాలో అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తుర్కయంజాల్‌కు చెందిన వీఎన్ కరాటే అకాడమీ క్రీడాకారులు బెస్ట్ టీమ్ కప్‌తో పాటు పలు పతకాలను సాధించినట్లు కరాటే అకాడమీ ఇండియా ఛీఫ్ అండ్ తెలంగాణ కరాటే అసోసియేషన్ కోశాధికారి వి.నరేందర్ శుక్రవారం వివరించారు. సీనియర్, జూనియర్ , సబ్ జూనియర్ కేటగిరీలలో కటా, కుమిటి విభాగాల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను సాధించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టీం మేనేజర్ ఎం.నర్సింగ్, కె.గణేష్, కె.సంపత్ కుమార్ పాల్గొన్నారు.